ప్రగతి పథం

- రూపురేఖలు మారిన 68వ వార్డు
- సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి
- అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు ప్రగతి పథంలో పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా వార్డులోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం, మౌలిక వసతులు సమకూర్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేలా పైపులైన్ల నిర్మాణాలు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, రజకుల జీవనోపాధికి ధోబీఖానాల నిర్మాణం తదితర దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి. వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది. కాల్వల నిర్మాణంతో నీరు నిల్వ లేకపోవడంతో దోమల సమస్య, మురుగుతో దుర్గంధం బాధలు తప్పాయి. చెరువుల సుందరీకరణలో భాగంగా లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్ నిర్మించడంతో వృద్ధులు, మహిళలకు, యువతకు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరేందుకు, వాకింగ్‌కు అనువుగా ఉంటోంది. వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, మింది, రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్‌నగర్ కాలనీ, గుడివాడ అప్పన్నకాలనీ, రాంనగర్ ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- అక్కిరెడ్డిపాలెంలో రూ.1 కోటి 48 లక్షలతో లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం


కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తున్న రాంనగర్ యూపీహెచ్‌సీ


మిందిలో సీసీ రోడ్డు, సీసీ కాలువ

- రాంనగర్‌లో రూ.2 కోట్లతో యూపీహెచ్‌సీ నిర్మాణం
- మింది వాటర్ ఫిల్టరైజేషన్ ప్లాంట్‌లో శిథిలమైన వాటర్ ఫిల్టరైజేషన్ ట్యాంక్‌ను రూ.50 లక్షలతో పునర్నిర్మించారు.
- ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు రూ.10 లక్షలు
- అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడ అప్పన్నకాలనీ ప్రాంతాల్లో రూ.2 కోట్ల 87 లక్షలతో శ్మశానవాటికల అభివృద్ధి
- రూ.39 లక్షలతో అక్కిరెడ్డిపాలెం, గిరిప్రసాద్ నగర్ కాలనీలో మంచి నీటి పైపులైన్‌ల నిర్మాణం
- రూ.39 లక్షలతో అక్కిరెడ్డిపాలెం, రాంగనర్, మిందిలలో ధోబీఖానాల నిర్మాణం
- రూ.49 లక్షలతో మింది ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం
- నాడు–నేడులో భాగంగా రూ.2 కోట్ల 50 లక్షలతో అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ హైస్కూల్స్ అభివృద్ధి


అక్కిరెడ్డిపాలెంలో లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్


అక్కిరెడ్డిపాలెంలో అభివృద్ధి చేసిన శ్మశానవాటిక

- సుమారు రూ.90 లక్షలతో షీలానగర్ నుంచి పాతగాజువాక వరకు సర్వీసు రోడ్డు ఆధునికీకరణ
- అక్కిరెడ్డిపాలెంలో రూ. 1 కోటితో సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణం
- మిందిలో రూ.1 కోటితో సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణం
- రాంనగర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కాలువలు నిర్మించారు.


మిందిలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

- గుడివాడ అప్పన్న కాలనీలో పలు అభివృద్ధి పనులకు రూ.80 లక్షలు వెచ్చించారు.
- రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరి ప్రసాద్ నగర్ కాలనీలలో రోడ్లు, సీసీ కాలువలతో పాటు పలు అభివృద్ధి పనులకు రూ.1 కోటి 30 లక్షల వరకు నిధులు వెచ్చించారు.
- వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, నీటి కనెక్షన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు రూ.3 కోట్ల 50 లక్షల వరకు వెచ్చించినట్లు కార్పొరేటర్ గుడివాడ అనూష తెలిపారు.

ఊహించలేనంత మార్పు



అక్కిరెడ్డిపాలెం గ్రామం స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగింది. అన్ని చోట్ల సీసీ రోడ్లు, సీసీ కాలువలు నిర్మించారు. ప్రతీ ఇంటికి మంచి నీటి కుళాయిలు రావడంతో తాగునీటికి ఇబ్బంది ఉండటం లేదు. ఎక్కడా విద్యుత్ సమస్య కూడా లేదు. సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి.

– టి.రాంబాబు, అక్కిరెడ్డిపాలెం

స్కూల్స్ చూస్తుంటే ఆశ్చర్యం



ప్రభుత్వ పాఠశాలలను చూస్తుంటే ఎంతో ఆశ్చర్యం కలుగుతోంది. ఎన్నో దశాబ్దాల నుంచి చూస్తున్నాం. ఇంత అభివృద్ధి ఎప్పుడూ కనిపించలేదు. పాఠశాలల రూపురేఖలు మారిపోయి కార్పొరేట్ స్కూల్స్‌లా ఉన్నాయి. అక్కడి విద్యార్థులు కూడా చక్కగా యూనిఫాం, షూ, టై తో చూడముచ్చటగా ఉంటున్నారు. రాంనగర్‌లోనే యూపీహెచ్‌సీ నిర్మించడంతో వైద్యసేవలు చేరువయ్యాయి. వైద్య పరీక్షల కోసం ఎక్కడికో దూరం వెళ్లక్కర్లేదు. వైద్యులు ఇక్కడే అందుబాటులో ఉంటున్నారు. ఇంత మార్పు అభినందనీయం.

– ఈటి దేవి, మింది

రోడ్లు చాలా బాగున్నాయి



గుడివాడ అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్ నగర్ కాలనీల్లో రోడ్లు చాలా బాగా వేశారు. గతంలో ఇరుగ్గా ఉన్న రోడ్లు ఇప్పుడు చాలా విశాలంగా మారడంతో రాకపోకలకు అవస్థలు తప్పాయి. గతంలో శ్మశానవాటిక సరిగ్గా లేకపోవడంతో కర్మకాండల కోసం చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు వాటిని కూడా ఆధునికీకరించారు.

– గుర్రం అరుణకుమారి, గుడివాడఅప్పన్నకాలని.

ఎన్నికల్లో విజయానికి సహకరించండి


గుడివాడ అమ్మన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

పెదగంట్యాడ: రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్.. సీనియర్ నాయకుడు గుడివాడ అమ్మన్న, గుడివాడ శ్రీనివాసరావును శుక్రవారం కలిశారు. మండలంలోని వుడా కాలనీ వినాయకనగర్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, గుడివాడ లతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన


చంద్రబాబు నాయుడు ఫొటోతో నడుపూరులో తిరుగుతున్న టీడీపీ నాయకుల కారు

పెదగంట్యాడ: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా తెలుగు దేశం పార్టీకి చెందిన ఓ కారు పెదగంట్యాడ మండలంలో తిరుగుతోంది. ఆ కారుకు పసుపు, ఎరుపు రంగులు వేయడంతో పాటు కారుపై తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఫొటోలతో యథేచ్ఛగా తిరుగుతోంది.

క్లుప్తంగా

నేటి నుంచి అయ్యప్ప స్వామి జయంత్యుత్సవాలు



అక్కిరెడ్డిపాలెం: అయ్యప్పస్వామి జయంత్యుత్సవాలను షీలానగర్‌లోని స్వామి వారి ఆలయంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ మణికంఠ జ్యోతి సేవా సంఘం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలను, ఆదివారం వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మూడు రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు ఉంటాయన్నారు.

భవిత కేంద్రానికి ఫిజియో థెరపీ సామగ్రి


విద్యాశాఖాధికారులకు ఫిజియో థెరపీ సామగ్రి అందజేస్తున్న దాతలు

పెదగంట్యాడ: మండలంలోని భవిత కేంద్రానికి దాతలు ఐన నాగరాజు, దుర్గాభవానీ స్టిమ్యులేటర్ ను, అల్ట్రా సౌండ్ సిస్టమ్‌ను సమకూర్చారు. వాటిని మండల విద్యా శాఖాధికారులు శ్రీనివాసరావు, రమణాజీకి శుక్రవారం అందజేశారు. భవిత కేంద్రంలోని పిల్లల సౌకర్యార్థం ఫిజియో థెరపీ సామగ్రిని అందజేయడం అభినందనీయమని ఎంఈవోలు దాతలను కొనియాడారు. నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు రవి, జయభారతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశం

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల సమావేశం 69వ వార్డు నాతయ్యపాలెంలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటలకు జరిగే సమావేశంలో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొంటారని తెలియజేశారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయ హుండీల ఆదాయం లెక్కింపు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయం హుండీల ఆదాయ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. 22వ తేదీ డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు హుండీ ఆదాయం రూ.1,22,823 వచ్చినట్లు ఆలయ పరిపాలనాధికారి అల్లు జగన్నాధరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షకుడు ఎస్.శ్రీనివాసరావు, ఆలయ పాలకమండలి చైర్మన్ గంట్రెడ్డి రామునాయుడు, సభ్యుడు పెట్ల అప్పారావు పాల్గొన్నారు. శ్రీ వారి సేవా సభ్యులు లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు.

కో–ఆపరేటివ్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ ఇవ్వనున్నామని కో–ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం ప్రకటించింది. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కో–ఆపరేటివ్ స్టోర్స్ 57వ మహాజన సభలో అధ్యక్షుడు బి.టి. జగదీశ్వరరావు మాట్లాడారు.

స్టోర్స్ ప్రస్తుతం 14,283 సభ్యులతో రూ.కోటి 22 లక్షల మూలధనం కలిగి నెలకు రూ.7 కోట్లు వ్యాపారం చేస్తోందన్నారు. ఉక్కునగరం పాఠశాలల్లో యూనిఫాం, నోట్ బుక్స్ అమ్మకాలు చేయడానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి జి.నాగభూషణం, ఉపాధ్యక్షులు ఆకుల నూకరాజు, కోశాధికారి పి.రామకృష్ణారావు, డైరెక్టర్లు ఎ.వి.ఎస్. సత్యనారాయణ, డి.వి.నాగబాబు, ఇ. లోకేష్, ఎన్.భాను, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

26న పైడిమాంబ అమ్మవారి జాతర


ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మంత్రి రాజశేఖర్ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 26 వరకూ ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు జరిపిస్తామన్నారు. ఈ నెల 23న రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం, 24న ఫ్రెండ్స్ కల్చరల్ సొసైటీ నృత్యప్రదర్శనలు, సంకల్పం నాటిక, హాస్యవల్లరి, 25న బుర్రకథ, రేలారే రేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 26న అమ్మవారి అనుపు ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఆరోజు అమ్మవారి తీర్థ మహోత్సవం ఉంటుందని చెప్పారు. బబ్లూ డ్యాన్సింగ్ స్టార్ మెగా ఈవెంట్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి. శ్రీనివాసరావు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన స్టీల్‌ప్లాంట్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా ఇతరుల అకౌంట్ల నుంచి నగదును దోచుకుంటున్నారన్నారు. ప్రతీ రోజు కోట్లాది రూపాయలు సైబర్ నేరగాళ్ల జేబులోకి వెళ్తున్నాయన్నారు. సుమారు 20 రకాల ఆన్‌లైన్ దొంగతనాలు జరుగుతున్నాయని వివరించారు. తెలియని యాప్‌లు, లింక్‌లను క్లిక్ చేయరాదని తెలిపారు. అనుమానం వచ్చిన ఫోన్ నంబర్లను ఎత్తవద్దని చెప్పారు. తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఏటీఎం పిన్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు వివరాలు తెలపరాదన్నారు. రివార్డులను ఆశగా చూపేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉన్న వ్యాపార లింక్‌లను తెరు/వరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో అడవులు కీలకం


మొక్కలు నాటుతున్న గంగవరం పోర్టు ప్రతినిధులు

పెదగంట్యాడ: వాతావరణంలో వచ్చే మార్పులు, జీవవైవిధ్యంలో వస్తున్న నష్టాలను అధిగమించాలంటే అడవులను పరిరక్షించాలని గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు అన్నారు. అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా అదానీ గ్రూప్ 100 మిలియన్ ప్లాంటేషన్‌లో భాగంగా గంగవరం పోర్టు ఇప్పటి వరకూ 2 లక్షల మొక్కల నాటే కార్యక్రమాన్ని పూర్తి చేసిందని వివరించారు. ఈ మొక్కలను పోర్టులోని నర్సరీ నుంచి తీసుకువచ్చామన్నారు. చెట్లను రక్షించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. అనంతరం పోర్టు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


ఊంజల్ సేవలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజావహారోహణం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పుష్పయాగం, ఊంజల్ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సబ్బవరం పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం సీఐ పిన్నంటి రమణ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు మీరి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జలమే జీవనాధారం

- భూగర్భజలాలను సంరక్షించుకుంటేనే మనుగడ
- తిరుమల నగర్ వాసుల అవగాహన ర్యాలీ


నీటి సంరక్షణపై ర్యాలీ చేస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు, విద్యార్థులు

కూర్మన్నపాలెం: జలమే జీవనాధారమని, ప్రతీ ఒక్కరు తమ పరిధిలో నీటిని సంరక్షించుకుంటేనే మనుగడ సాధ్యమని తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. నీటిని పొదుపుగా వాడాలని, భవిష్యత్తు అవసరాల కోసం భూగర్భజలాలను సంరక్షించుకోవాలని సూచించారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి ర్యాలీ నిర్వహించారు. భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలను తవ్వి వర్షం నీటిని, వాడుక నీటిని సంరక్షించాలని సూచించారు. తద్వారా భావితరాలకు నీటి వనరులు పుష్కలంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, అప్పలనాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: ప్రపంచ నీటి దినోత్సవాన్ని శుక్రవారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ ఈడీ (వర్క్స్)కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐఐఎంవీ ప్రొఫెసర్ ఎం.విజయభాస్కర్ ప్రపంచ నీటి దినోత్సవం థీమ్ 'శాంతి కోసం నీరు' అంశాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నీటి సంబంధిత పరిశ్రమల్లో పంపిణీ చేయబడిన లెడ్జర్‌ల నవీకరణ కోసం బ్లాక్ చెయిన్ టెక్నాలజీని ఉపయోగించినట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె.సోఠీ నీటి సంరక్షణ గురించి తెలియజేశారు. నీటి కొరతను అధిగమించేందుకు మరిన్ని నిర్వహణ పద్ధతులు, సాంకేతికతను ఉపయోగించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, విభాగాదిపతులు పాల్గొన్నారు.


నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ప్రొఫెసర్ విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు

జేవీవీ ర్యాలీ

గాజువాక : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని గాజువాకలో శుక్రవారం నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ భూగర్భ జలాలను సంరక్షించే కార్యక్రమాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డి.వేణుగోపాల్, ఎస్‌వీకే పరశురామ్, పాలూరి లక్ష్మణస్వామి, పద్మజ, సూర్యకుమారి, ఎస్.ఆర్.లక్ష్మి, స్వర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి కళాక్షేత్రం మాజీ కార్యదర్శిపై కేసు నమోదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు కార్మిక సంఘానికి చెందిన నాయకుల మధ్య పెరిగిన కలహాలు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర కేసరి కళాక్షేత్రం ప్రస్తుత కార్యదర్శి టి.సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ కార్యదర్శి సిహెచ్.వి.సత్యనారాయణపై స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. యాజమాన్యం కళాక్షేత్రం కార్యదర్శిగా టి.సత్యనారాయణ ఈ ఏడాది జనవరి 31న నియమితులయ్యారు. కొత్త కార్యదర్శికి మాజీ కార్యదర్శి రికార్డులు అందజేయలేదు. ఈ నెల 18న కళాక్షేత్రానికి వచ్చిన మాజీ కార్యదర్శి కొత్త కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. యాజమాన్యం నిర్ణయం మేరకు నూతన కార్యదర్శి కళాక్షేత్రం రికార్డులను దాచి ఆ కార్యాలయానికి తాళం వేశారు. మాజీ కార్యదర్శి సత్యనారాయణ తాళం విరగ్గొట్టి కార్యాలయం లోపలికి ప్రవేశించి అక్కడి రికార్డులను దొంగిలించారని ప్రస్తుత కార్యదర్శి శుక్రవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వీరుల త్యాగం.. వృథా కానివ్వం'


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1135వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను సైతం ధారపోశారన్నారు. ఎంతోమంది భూములను ధారాదత్తం చేశారన్నారు. నాటి త్యాగధనుల స్ఫూర్తితో, చెదరని సంకల్పంతో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

'పుస్తక జ్ఞానానికే పరిమితం కావద్దు'



ప్రసంగిస్తున్న బికాస్ కుమార్ నాయక్

గాజువాక : విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకూడదని అరబిందో ఫార్మా ప్లాంట్ హెడ్ బికాస్ కుమార్ నాయక్ అన్నారు. స్థానిక ఎంవీఆర్ పీజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన నూతన విద్యార్థుల స్వాగత సభలో ఆయన మాట్లాడారు. పుస్తకాల నుంచి జ్ఞానాన్ని సముపార్జించడంతో పాటు సమాజంలో, తమ పరిసరాల్లో జరుగుతున్న వివిధ అంశాలనుంచి కూడా నేర్చుకునే విషయాలు ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ టి.ఎల్లేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.